క్లుప్తంగా

రంగస్థల కళాకారులు ఐక్యంగా ఉండాలి



దాచేపల్లి : కళాకారులు ఐక్యమత్యంగా ఉండాలని సినీ నటుడు శివం అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో జాతీయ కళాకారుల సంక్షేమ సంఘం కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి కళలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులకు గుర్తింపుకార్డులతో పాటుగా ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. అర్హులైన రంగస్థల కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలని, కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిన్నెల్లి శ్రీనివాసనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థలం సీనియర్ దర్శకుడు చింతపల్లి మస్తాన్, తెలంగాణ శాఖ అధ్యక్షుడు షేక్ సైసావలి, కమిటీ సభ్యులు నరసింహారావు, రాజేష్, ఎవీఆర్. చౌదరి, కటకం శ్రీనివాస్, పిన్నెల్లి అంజిరెడ్డి, ఫిరంగిపురం మస్తాన్‌వలి, డ్యాన్స్ మాస్టర్లు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

యోగ విజ్ఞాన సేవా సంఘం ఎన్నిక

దాచేపల్లి : యోగ విజ్ఞాన సేవాసంఘం అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన గాదె రామకృష్ణారెడ్డి ఎన్నికై య్యారు. నారాయణపురంలోని యోగ విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన కమిటీ సభ్యుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిట్టిప్రోలు అమరలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా యర్రంశెట్టి గోపినాథ్, సహాకార్యదర్శిగా మాశెట్టి గురుప్రసాద్, కోశాధికారిగా బొడ్డు వెంకట లక్ష్మీనరసింహారావు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

నవోదయ సీటు సాధించిన నాగధీరజ్



దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడు మెయిన్ పాఠశాల విద్యార్థి నిడుముక్కల నాగధీరజ్ నవోదయ సీటు సాధించాడని ప్రధానోపాధ్యాయుడు ఎం. జగన్నాధం సోమవారం తెలిపారు. 2021-22లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో సెకండ్ లిస్ట్‌లో నాగధీరజ్‌కు సీటు వచ్చిందని ఆయన చెప్పాడు. నవోదయ సీటు సాధించిన నాగధీరజ్‌ను ఉపాధ్యాయులు జీ. శ్రీనివాసరెడ్డి, ఆడేపు రాజేష్, అజయ్‌కుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన పోట్లూరు గ్రామ పంచాయతీ శివారు కృష్ణాపురం జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని వేల్పూరుకు చెందిన లోకయ్య, మస్తాన్‌వలీ స్వగ్రామం నుంచి వినుకొండకు వెళుతున్నారు. ఈ క్రమంలో వినుకొండ నుంచి నరసరావుపేట వెళుతున్న లారీ కృష్ణాపురం గ్రామ సమీపాన అదుపుతప్పి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకయ్యకు కుడి కాలు విరిగిపోగా, మస్తాన్‌వలీకి స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇద్దరిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనపల్లి వెంకటేశ్వర్లు(79) పట్టణంలోని రజకకాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గత కొన్ని రోజులుగా ప్రకాశం జిల్లా గొల్లపూడిలో రెండో కుమార్తె వద్ద ఉంటూ ఆదివారం రాత్రి పట్టణానికి తిరిగి వచ్చాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో రాత్రి కడుపునొప్పి భరించలేక రేకులషెడ్డులోని తన ఇంటిలో ప్లాస్టిక్ వైరుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం కరెంట్ బిల్లు తీసే వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

సమస్యలపై చర్చా వేదిక

నరసరావుపేట ఈస్ట్: ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాలులో సోమవారం సాయంత్రం పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల జీతభత్యాలు-చట్టబద్ధత-మార్గదర్శకాలు అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు.

వైభవంగా కల్యాణోత్సవం

నరసరావుపేట రూరల్: పాలపాడులోని శ్రీ గోవయ్య సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ధర్మకర్త యక్కంటి సుబ్బారెడ్డి, సభ్యులు కొలిశెట్టి వెంకటేశ్వర్లు, గాదె పెద్దిరెడ్డి, కుంచాల శివవెంకట్రావు, వై.ధర్మరావు పర్యవేక్షించారు.

గృహసారథులే సంక్షేమ వారధులు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు

పిడుగురాళ్లరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధిని ప్రతి కుటుంబానికి తీసుకొని వెళ్లాల్సిన సైన్యం గృహసారథులేనని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యప్పనగర్‌లోని అభయాంజనేయస్వామి కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో 10 శాతం సంక్షేమాన్ని అందజేసి 90 శాతం ప్రచారం చేసుకున్నారని, నేడు మన ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం ప్రతి గడపకు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీది అన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన, దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. గృహసారథులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులతో కలిసి ప్రతి కుటుంబాన్ని కలవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను, జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం అందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, ఈ విషయం ప్రతి గడపకు చెప్పాలన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, నాడు, నేడు ద్వారా స్కూల్స్ అభివృద్ధికి కోటికి పైగా ఖర్చు పెట్టామని, ఇది కాదా అభివృద్ధి అంటే అని అన్నారు. ఆ గ్రామంలో ఏ అభివృద్ధి జరిగిందో, ప్రతి గడపకు ఏ సంక్షేమం మన ప్రభుత్వం అందించిందో ప్రతి గడపకు తెలియజేయాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులపై ఉందన్నారు. వారికి వచ్చిన సంక్షేమాన్ని మనం తెలియజేస్తే గురజాల నియోజకవర్గంలో 2024లో 28 వేలు కాదు, మళ్లీ 38 వేల మెజార్టీతో ప్రజలు మనకు పట్టం కడతారన్నారు. గురజాల నియోజకవర్గంలో 55 గ్రామాలకు ఉన్న 88 వేల కుటుంబాలకు 75 కోట్లతో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించబోతున్నామన్నారు. త్వరలోనే టెండర్లు పిలుస్తామని తెలియజేశారు. ఈరోజు నియోజకవర్గంలో గడప గడపకు ద్వారా 25 వేల కుటుంబాలను కలిశానని కేవలం అది జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ధైర్యం, పారదర్శకమైన పాలన, అవినీతి లేని పాలన ద్వారానే జరిగిందన్నారు. గ్రామాల్లో కూడా కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కాలర్ ఎగరవేసుకొని టీడీపీ గడపను సైతం సంక్షేమ పథకాలు అందించామని చెప్పుకునే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. నిన్న జరిగిన మైనార్టీ సభలో యరపతినేని మైనార్టీలకు ఏదో మేలు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని , మైనార్టీలకు ఉన్నతమైన పదవులు టీడీపీహాయంలో ఇచ్చారని అని ప్రశ్నించారు. నేడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉన్నతమైన పదవులు ఇచ్చింది అంటే అది వైఎస్సార్‌సీపీనేని తెలియజేశారు. హత్యల గురించి మర్డర్‌లు చేసిన వారు మాట్లాడితే వింతగా ఉందన్నారు. ఇవాళ్ల గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చూడు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటీసీ సభ్యులు వీరభద్రుని రామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీలు గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సాతులూరి బాబు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, మండల సచివాలయ ఇన్‌ఛార్జి అధ్యక్షులు భూమిరెడ్డి యల్లారెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, సర్పంచ్‌లు, షేక్ ఖాశీంబి బడేషా, బైరపోగు కుమారి ఏలయ్య, చల్లా శివారెడ్డి, గోళ్ల హనుమంతరావు, గొట్టిముక్కల శివారెడ్డి, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వినర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కృష్ణా జలాశయంలోకి చేపపిల్లలు విడుదల



లాంచీస్టేషన్ వద్ద కృష్ణా జలాశయంలో చేపపిల్లలను విడుదల చేస్తున్న సాయిమార్కొండారెడ్డి

విజయపురిసౌత్: రాష్ట్రంలో మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించి వారి జీవితాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపుతున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లోని లాంచీస్టేషన్ వద్ద కృష్ణా జలాశయంలో మత్స్యకారుల జీవనోపాధి కోసం 2 లక్షల 70వేల చేపపిల్లలను విడుదల చేసి అనంతరం మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో హార్బర్లను ఏర్పాటు చేయడం, జలాశయంలో చేపపిల్లలను వేయడం, ఎక్కడికక్కడ మత్స్యకారులకు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం అందిస్తోందన్నారు. మత్స్యకారుల కుటుంబాల్లో మార్పు కోసం జగనన్న పేరుతో కాలనీలు నిర్మాణం చేసి మత్స్యకారులకు స్థిరమైన నివాసం ఏర్పాటు చేస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల్లో వెలుగులు నింపుతున్న మహానియుడు సీఎం జగన్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ మురళి, జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, ఏఓ లక్ష్మారెడ్డి, ఎఫ్‌డీఓ టి రఘుకృష్ణారెడ్డి, స్థానిక మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు కె ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా కోటేశ్వరరావు బాధ్యల స్వీకరణ



ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న కోటేశ్వరరావును అభినందిస్తున్న ఉద్యోగులు

మాచర్ల రూరల్: మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా వై కోటేశ్వరరావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన కె సురేష్ విజయ్‌కుమార్ అనారోగ్యంతో మృతిచెందడంతో ఈఓపీఆర్‌డిగా ఉన్న కోటేశ్వరరావుకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ జి శ్రీనివాసరావు, డి విజయ్‌కుమార్, నరేష్, పంచాయతీ కార్యదర్శులు వై కోటేశ్వరరావు, ఎ వెంకట్రామయ్య, దస్తగిరి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, బిట్టు వెంకటేశ్వర్లు, ఎపిఓ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు మేకల వెంకటేశ్వర్లు, సాంబ, శంకర్, రాణిలు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

మరమ్మతుల కోసం పరికరాలు అందజేత



బోరు మరమ్మతుల కిట్టును వీఆర్‌ఓకు అందజేస్తున్న సర్పంచ్ రంగయ్య, కార్యదర్శి బాబులాల్‌నాయక్

మాచర్ల రూరల్: బోరు, నీటి ట్యాంకులు, వీధి కొళాయిలు మరమ్మతులు చేసేందుకు వాటర్ ఎయిర్ ఇండియా ఆధునిక టెక్నాలజీతో కూడిన యంత్రాలను గ్రామానికి అందించడం అభినందనీయమని సర్పంచ్ కర్రా చిన రంగయ్య అన్నారు. సోమవారం మండలంలోని పశువేముల గ్రామంలో వాటర్ ఎయిర్ ఇండియా వారు బోరు, నీటి ట్యాంకులు, వీధి కొళాయిలు మరమ్మతులు చేసే కిట్టును అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వాటర్ ఎయిర్‌ఇండియా ఈఎస్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించేందుకు ఆధునిక, సాంకేతిక టెక్నాలజీతో కూడిన యంత్రాలను తమ సంస్థ అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి బాబులాల్‌నాయక్, వీఆర్‌ఓ ప్రశాంతి, గంగాభవాని, సురేష్, వెంకటేష్, రమేష్, సుకన్య, లక్ష్మి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రియాలను జయిస్తే ఏదైనా జయించవచ్చు



పిరమిడ్ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తున్న హిమాలయ యోగి సంతు సధాన స్వామి గురూజీ, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

పిడుగురాళ్లరూరల్: విద్యార్థి దశలోనే ఇంద్రియాలను జయిస్తే ఏ లక్ష్యాలనైనా సాధించవచ్చునని హిమాలయ యోగి సంతు సధాన స్వామి గురూజీ, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని జానపాడు శివారులోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆక్స్‌ఫర్డ్ పిరమిడ్ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిమాలయ యోగి సంతు సధాన స్వామి గురూజీ, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని వారు మాట్లాడుతూ...ధ్యానం ద్వారా మోక్షం పొందవచ్చునన్నారు. ధ్యాన సాధన ద్వారా మానసిక ఆందోళన, ఒత్తిడిని, మానసిక ప్రశాంతను పొందవచ్చునన్నారు. విద్యార్థులకు జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతాయన్నారు. జీవితంలో ఎదరయ్యే కష్ట సుఖాలను ఎదుర్కొనవచ్చునన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే ఏదైనా సాధించవచ్చునని, అందుకని ప్రతి విద్యార్థి ఈ దశలోనే ధ్యానంపై మక్కువ చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, సెక్రటరీ గిరిధర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: మండలంలోని జంగాలపల్లెలో కొలువైయున్న సీతారామాంజనేయస్వామి, వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు వాసు, సురేష్ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం వైభవంగా కల్యాణంతో పాటు ఆలయం ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. గ్రామ సర్పంచ్ బత్తుల సీతారామిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాత్రికి హరేరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మైనింగ్ ప్రాంతంలోని భూములు కొనుగోలు చేయాలి



ఫ్యాక్టరీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దాచేపల్లి : మైనింగ్ ప్రాంతంలో ఉన్న భూములను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని తంగెడ గ్రామ సమీపంలోని భవ్య సిమెంట్స్ ప్రధానగేట్ వద్ద బాధిత రైతులు ఆందోళనకు దిగారు. తమ భూములు తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ చేస్తున్న ప్రాంతంలో 140 ఎకరాలకు పైగా తాము వేస్తున్న పంటలు పండడం లేదని, తమ పొలాలపై దుమ్ము, ధూళీ పండడం వల్ల పంటలన్నీ నాశనమౌతున్నాయని వారు చెప్పారు. మైనింగ్ వల్ల పంటలు పాడై ప్రతి ఏటా తమకు నష్టం సంభవిస్తోందని, ఈ విషయాన్ని ఫ్యాక్టరీ యజమాన్యం దృష్టికి తీసుకెళ్తే ప్రతి నెల 30 ఎకరాల చొప్పున భూములు కొనుగోలు చేస్తామని ఐదు నెలల క్రితం మాట ఇచ్చి ఇంత వరకు కేవలం ఏడు ఎకరాలు కొనుగోలు చేసి మితగా భూములు కొనుగోలు చేయకుండా యజమాన్యం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని రైతులు మండిపడ్డారు. వ్యవసాయం చేసుకుని జీవించే తమ జీవితాలతో ఫ్యాక్టరీ యజమాన్యం చెలగాటమాడుతుందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ భూములు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు. బాధిత రైతుల ఆందోళన గురించి తెలుసుకున్న జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు కొత్తపల్లి కాశయ్య, దైద నాగరాజు ఫ్యాక్టరీ గేట్ వద్దకు వెళ్లి బాధిత రైతులతో మాట్లాడారు. బాధిత రైతులతో కలిసి ఫ్యాక్టరీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. భూముల కొనుగోలు చేసేందుకు ఫ్యాక్టరీ యజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఫ్యాక్టరీ అధికారులు హామి ఇవ్వటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవళ్ల వీరాస్వామి, నాయకులు ఆరికట్ల మల్లారెడ్డి, బీరవల్లి శౌర్రెడ్డి, గోగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టి రామచంద్రారెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మార్కొండారెడ్డి



రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న కుర్రి సాయి మార్కొండారెడ్డి

విజయపురిసౌత్: రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతు భరోసా కేంద్రంలోని కియోస్క్ ద్వారా ఈ-క్రాఫ్, ఈకెవైసీలను, రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విజయపురిసౌత్‌లో 12 ఎకరాల్లో ఎరువులు వాడకుండా సాంప్రదాయ బద్ధమైన సేంద్రియ ఎరువులతో ఉద్యావన పంటలు పండించి అధిక దిగుబడి సాధిస్తున్న రైతు పిల్లి పద్మారావును శాలువాతో ఘనంగా సత్కరించారు. రైతు పద్మారావును ప్రతి ఒక్క రైతు ఆదర్శంగా తీసుకుని సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ మురళి, జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, ఏఓ లక్ష్మారెడ్డి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లలిత, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే రైతుల ఖతాల్లో నగదు జమ



పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి, ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఈకేవైసీ (ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి) చేయించుకుంటేనే రైతుల ఖతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. సోమవారం ఆయన మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డితో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో పంట నమోదు సూపర్ చెక్‌లో భాగంగా సాగు చేస్తున్న పంట పొలాలను సందర్శించి పరిశీలించి మాట్లాడారు. రబీ కాలంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా సుమారు 91,800 ఎకరాల్లో పంటలను సాగుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తి చేయగం జరిగిందన్నారు. మిగిలిన 60 శాతం రైతులు కూడ వెంటనే నిర్ణీత గడువులోపు ఈకేవైసీ చేయించుకోవాలని అప్పుడే వారికి రైతు భరోసా, పీఎం కిసాన్, పంట భీమా, ధాన్యం కొనుగోలు, సున్న వడ్డీ, తదితర రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పొందవచ్చన్నారు. ఇప్పటి వరకు 11 విడతలుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ, రైతు భరోసాకేంద్రం సిబ్బంది గడువులోపు 100శాతం ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసాకేంద్రం సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ టోర్నీలో సీఆర్ జట్టుకు ప్రథమ స్థానం



నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన అంతర్ కళాశాలల బేస్‌బాల్ టోర్నమెంట్‌లో శ్రీ చుండి రంగనాయకులు కళాశాల జట్టు ప్రథమ స్థానం స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారుల్ని కళాశాల పాలక మండలి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, అధ్యక్షుడు విజయసారథి, ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, పీడీ నాగేంద్ర విద్యార్థుల్ని అభినందించారు. జాతీయ పోటీల్లో సత్తా చాటి కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

యూనివర్సిటీ జట్టుకు ఐదుగురి ఎంపిక

టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన కళాశాల విద్యార్థులైన బి. సతీష్, బి. సాగర్‌బాబు, ఎం. సతీష్, ఎ. కుమారబాబు, ఎం. వేణు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 14-18 వరకూ అస్సాంలో జరిగే ఆలిండియా యూనివర్సిటీల టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కారెంపూడి : మండలంలోని కారెంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి, ఒప్పిచర్ల గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని మండల విద్యుత్తు శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. కారెంపూడి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్ పర్యటన

గురజాల : పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్ మంగళవారం పర్యటించనున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి కె అద్దెయ్య తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ చేతులమీదుగా భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యంవైపు అడుగులు వేయాలి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

పిడుగురాళ్లరూరల్: ప్రతి విద్యార్థి లక్ష్యం వైపు అడుగులు వేయాలని వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల్లో 9వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. విద్యార్థికి చదువుపట్ల మక్కువ ఉండాలని, అదేవిధంగా క్రీడలవైపు కూడా దృష్టిసారించాలన్నారు. ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్యం వైపు అడుగులువేయాలని, ఆ లక్ష్యం కోసం కృషి చేయాలని అన్నారు. తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, ఆ గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

11న మెగా లోక్ అదాలత్

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 11వ తేదీ శనివారం మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ధారా చెన్నయ్య అన్నారు. మెగాలోక్ అదాలత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ధారా చెన్నయ్య మాట్లాడుతూ రాజీపడే అనేక కేసులను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని, రాజీమార్గమే రాజమార్గమని అనే నినాదాన్ని కక్షిదారులకు తెలియజేస్తామని దాని ద్వారా రాజీపడే విధంగా చేస్తామని ఆయన తెలిపారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల ఏర్పాటు

కమిషనర్ మోహన్ శ్రీనివాసరావు

గురజాల : నగర పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు ఇచ్చిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడమై లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ లోని గురజాల, జంగమహేశ్వరపురం గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ప్రతి ఒక్క లబ్ధిదారుడు విధిగా ఇళ్లను కట్టుబడి చేసుకోవాలన్నారు. కాలనీల్లో నీటి సమస్య, కరెంటు సమస్యలు లేకుండా రహదారి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి ఇళ్లు ఉండాలనే లక్ష్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు.

జాతీయ చేనేత పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా బాలకోటేశ్వరరావు

మాచవరం: గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన ఈర్నాల బాల కోటేశ్వరావునుజాతీయ చేనేత ఐక్యవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా కమిటీలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషింగప్ప నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సమస్యలపై స్పందించి చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా పోరాటం చేయాలని ఆయన సూచించారు.

కనమర్లపూడిలో రూ.20 లక్షలతో పనులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ కొత్తగుండ్ల వెంకటేశ్వరస్వామి సోమవారం తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో రూ. 10 లక్షలతో 200 మీటర్ల వరకు సీసీ రోడ్లు పనులు ప్రారంభించామని చెప్పారు. మరో రూ.10 లక్షలతో బీసీ కాలనీలో 400 మీటర్ల వరకు సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు పారదర్శకంగా చేశామని పేర్కొన్నారు.